సాక్షి అనకాపల్లి

గురువారం । 27 । మార్చి । 2025



అప్పన్న హుండీ లెక్కింపు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం 21 రోజులకు రూ.1.57 కోట్లు వచ్చినట్లు ఈవో కె.సుబ్బారావు తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
అనకాపల్లి	6.14	4.40
నర్సీపట్నం	6.17	4.38

టెన్త్ సోషల్ పరీక్షపై ఇంకా స్పష్టత లేదు:డీఈవో

అనకాపల్లి టౌన్: రంజాన్ పండగ రోజైన ఈ నెల 31న జరగాల్సిన పదో తరగతి సాంఘిక శాస్త్ర పరీక్ష నిర్వహణ తేదీపై అధికారికంగా ఎటువంటి ప్రకటన రాలేదని, ఈ విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు. పండగ 31న జరిపితే సాంఘిక శాస్త్ర పరీక్షను ఏప్రిల్ ఒకటో తేదీన నిర్వహిస్తామని, ఒకవేళ రంజాన్ పండగ ఒకటో తేదీన నిర్వహించాలని ప్రకటిస్తే, హాల్ టికెట్లో పేర్కొన్న విధంగా ఈనెల 31వ తేదీన యథావిధిగా సాంఘిక శాస్త్ర పరీక్ష జరుగుతుందని తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ విషయంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు.

ఫిజిక్స్ పరీక్షకు 99.51 శాతం హాజరు

పదో తరగతి విద్యార్థులకు బుధవారం జరిగిన భౌతిక శాస్త్రం పరీక్షకు జిల్లాలో 99.51 శాతం మంది హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు తెలిపారు. జిల్లాలో 107 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 20,774 మంది విద్యార్థులకు 20,673మంది హాజరవ్వగా 101మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటుగా రాస్తున్న 766 మంది విద్యార్థులకు 659 మంది హాజరయ్యారు. ఏపీ సార్వత్రిక విద్యాపీఠంలో 561 విద్యార్థులకు గాను 105 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఈ పరీక్షా కేంద్రాలను రాష్ట్ర స్థాయి పరిశీలకులు, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అదనపు సంచాలకులు పి శ్రీనివాస్, తాను తనిఖీ చేశామన్నారు.

టీడీపీలో మేయర్ గుబులు!



అవిశ్వాస తీర్మానంతో ఆందోళన

- నేరుగా రంగంలోకి దిగుతున్న మంత్రి లోకేష్
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేటర్లతో సమావేశం?
- వెంటాడుతున్న యాదవ సామాజికవర్గ డిమాండ్లు
- పీఠం ఆశిస్తున్న వ్యక్తులపై ఇప్పటికే అవినీతి మరకలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

కూటమి పార్టీలకు మేయర్ అవిశ్వాసం గుబులు మొదలైంది. నాలుగేళ్ల తర్వాత అవిశ్వాసం పెట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో మెజార్టీ లేకపోయినప్పటికీ కలెక్టర్‌ను కలిసి కూటమి పార్టీల నేతలు నోటీసులు అందజేశారు. ఒకవైపు అసలు మెజార్టీ లేకపోవడం ప్రధాన సమస్య కాగా.. తీరా నోటీసుల తర్వాత సొంత పార్టీలోనే మేయర్ పీఠాన్ని అధిష్టించేది ఎవరనే ప్రశ్నలతో పాటు తమ సామాజికవర్గానికే మేయర్ పీఠాన్ని ఇవ్వాలంటూ యాదవ నేతలంతా ఐక్యంగా గొంతు కలపడం కూటమి ప్రభుత్వానికి కునుకు లేకుండా చేస్తోంది. ఈ నేపథ్యంలో నేరుగా మంత్రి లోకేష్ రంగంలోకి దిగుతున్నట్టు సమాచారం. ఇందులో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు కార్పొరేటర్లతో సమావేశం కానున్నట్టు తెలుస్తోంది. స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో పనికావడం లేదని భావించడంతోనే లోకేష్ తెరమీదకు వచ్చినట్టు సమాచారం. మరింతగా ప్రలోభాలు పెట్టో.. బెదిరింపులకు పాల్పడటం ద్వారానో అవిశ్వాసం నెగ్గేందుకు అవసరమైన 2/3 మంది కార్పొరేటర్లను (64 మంది) లాగేసేందుకు రెడ్ బుక్ రాజ్యాంగాన్ని విశాఖలో కూడా అమలు చేసేందుకే లోకేష్ వస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే, లోకేష్ రాకపై అటు అధికార యంత్రాంగానికి.. పార్టీలోని ముఖ్యనేతలకు అధికారికంగా సమాచారం లేదు. కానీ లోకేష్ సమావేశం విషయం వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ టీమ్ ద్వారా ప్రజాప్రతినిధులకు సమాచారం చేరవేస్తుండడం చర్చనీయాంశమవుతోంది.

ప్రలోభాలతో ప్రయత్నాలు



వాస్తవానికి జీవీఎంసీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు 2/3 మెజార్టీ అవసరం ఉంది. అయితే కూటమి పార్టీలకు అంత మెజార్టీ లేదు. కొద్ది మందిని బెదిరించి, మరి కొద్ది మందిని ప్రలోభాలకు గురిచేసి తమ వైపునకు లాక్కొనే ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ అవిశ్వాసం నెగ్గేందుకు అవసరమైన మెజార్టీ (64 మంది కార్పొరేటర్లు) దక్కలేదు. ఈ నేపథ్యంలో మరింతగా ప్రలోభాలకు గురిచేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడటం ద్వారా నెగ్గేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం ముగ్గురు నేతలకు బాధ్యతలను అప్పగించారు. వీరంతా కొద్ది మందిని నయానో భయానో తమ పార్టీల్లోకి చేర్చుకునే ప్రయత్నం చేశారు. అయినా 2/3 మెజార్టీ సభ్యులు కూటమి పార్టీల్లో చేరలేదు. అవిశ్వాసం నోటీసులో పలువురి సంతకాలను కూటమి నేతలే చేసినట్లు విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో ఇక లాభం లేదనుకుని నేరుగా లోకేష్ రంగంలోకి దిగుతున్నట్టు సమాచారం.

అవినీతి ఆరోపణలతో...!

మేయర్ పీఠాన్ని ఆశిస్తున్న వ్యక్తితో పాటు డిప్యూటీ మేయర్లుగా రంగంలో ఉన్న మరో ముగ్గురు కార్పొరేటర్ల వ్యవహారశైలిపై ఇప్పటికే అనేక ఆరోపణలున్నాయి. స్టాండింగ్ కమిటీ సమావేశాల సందర్భంగా వసూళ్లతో పాటు ప్రతీ పనికీ ఇంత రేటు చెప్పి వసూలు చేస్తున్న వ్యవహారంపై అనేక విమర్శలున్నాయి. ఈ నలుగురు కలిసి ఇప్పటికే కార్పొరేషన్‌లో తెగబడి చేస్తున్న వసూళ్లతో చెడ్డపేరు వచ్చిందని కూటమిలోని ఇతర కార్పొరేటర్లు మండిపడుతున్నారు. కొద్ది మంది కాంట్రాక్టర్లు బీజేపీ ఎమ్మెల్యేను కలిసి మరీ వసూళ్ల పర్వంపై ఫిర్యాదు కూడా చేశారని తెలుస్తోంది. అంతేకాకుండా నేరుగా టీడీపీ అధిష్టానానికి కూడా వీరి వ్యవహారశైలిపై ఫిర్యాదులు రావడంతో పునరాలోచన పడినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో లోకేష్ నిర్వహించబోయే సమావేశంలో ఏ నిర్ణయం తీసుకుంటారనే చర్చ సాగుతోంది.

యాదవ సామాజికవర్గ డిమాండ్‌తో...!

అవిశ్వాసం నేపథ్యంలో మేయర్ పీఠం తనదేనని ఇన్ని రోజులు ప్రచారం చేసుకున్న పీలా శ్రీనివాసరావు పేరు మరోసారి వినిపిస్తోంది. అయితే తమ నియోజకవర్గానికి చెందిన వ్యక్తికి మేయర్ పీఠం ఎక్కితే... తన ప్రాబల్యం తగ్గుతుందనే ఆందోళనతో స్థానిక ఎమ్మెల్యే సహకరించడం లేదని తెలుస్తోంది. మరోవైపు తన నియోజకవర్గం నుంచి డిప్యూటీ మేయర్లు కాబోతున్నారనే ప్రచారంతో మరో ఎమ్మెల్యే కూడా పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఇక యాదవ సామాజికవర్గానికి చెందిన కార్పొరేటర్లందరూ అవిశ్వాస తీర్మానంపై గుర్రుగా ఉన్నారు. తమ సామాజిక వర్గానికి చెందిన మహిళకు పదవి వస్తే.. తట్టుకోలేక అవిశ్వాసం పెడుతున్నారంటూ లోలోపల రగిలిపోతున్నారు. కొద్ది మంది ముందుకు వచ్చి మరి విమర్శలు గుప్పిస్తున్నారు. తమ సామాజిక వర్గానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని.. ఇప్పుడు అవిశ్వాసం పేరుతో వేరే సామాజికవర్గానికి మేయర్ పీఠం అప్పగిస్తే సహకరించే ప్రసక్తే లేదని తెగేసి చెబుతున్నారు. యాదవ సామాజికవర్గ డిమాండ్ల నేపథ్యంలో కూటమి పార్టీలోని ఆ సామాజికవర్గ ఇద్దరు ఎమ్మెల్యేలు కంగుతింటున్నారు. ఇది చిలికిచిలికి గాలివానలాగా మారి తమకు పెద్ద ఇబ్బంది తెచ్చిపెడుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే అవిశ్వాసానికి వీరి నుంచి పెద్దగా మద్దతు ఉండటం లేదంటూ పీఠాన్ని ఆశిస్తున్న వ్యక్తులు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. దీంతో లోకేష్ తెర మీదకు వచ్చినట్టు అధికార టీడీపీలో చర్చనీయాంశమవుతోంది.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



హర్షతేజను అప్పగిస్తున్న పోలీసులు

మాకవరపాలెం: కనిపించకుండా పోయిన బాలుడిని పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. గాజువాకకు చెందిన హర్షతేజ (14) తామరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. చదువుపై విరక్తితో ఈ నెల 22న పాఠశాల నుంచి ఎవరికీ కనిపించకుండా వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యం మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ ఆదేశాలతో పోలీసులు మూడు టీంలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. విశాఖలోని ఆర్కే బీచ్‌లో బుధవారం హర్షతేజను పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించినట్టు ఎస్‌ఐ దామోదర్ నాయుడు తెలిపారు.

బెల్టు దుకాణాల జోరు

- వరుస మరణాలతో జనం బేజారు
- వెదురుపర్తిలో మద్యం తాగి పలువురు మృతి



కోటవురట్ల: మండలంలోని వెదురుపర్తి గ్రామంలో బెల్టు దుకాణాల ద్వారా మద్యం (బ్రాందీ) అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని, మద్యం తాగి మృత్యువాత పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నాలుగు బెల్టు దుకాణాలున్నాయని, వాటిలో మద్యం విక్రయిస్తుండటం వల్ల ఎక్కువ మంది మందుకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరిలో కొందరు మృత్యువాత పడుతున్న సందర్భాలున్నాయంటున్నారు. రెండు నెలల క్రితం మద్యం అతిగా సేవించడం వల్ల ఇద్దరు వృద్ధులు మృతి చెందారని స్థానికులు తెలిపారు. తాజాగా బుధవారం మద్యం అతిగా సేవించి కంఠపురెడ్డినాయుడు (45) మృతి చెందినట్లు చెప్పారు. మద్యం అమ్మకాలు ఇలాగే కొనసాగితే మరింతమంది మద్యం కాటుకు గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముమ్ముందు ఇక ఎవరూ మృత్యువాత పడకుండా బెల్టు దుకాణాల్లో మద్యం విక్రయాలను అరికట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నాకు ఆత్మహత్యే శరణ్యం

- వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యేలు కన్నబాబురాజు, బాబూరావులపై లైంగిక వేధింపుల కేసు పెట్టాలని హోం మంత్రి ఒత్తిడి
- ఒప్పుకోలేదని లేనిపోని ఆరోపణలు చేసి ఆరు నెలల క్రితం విధుల నుంచి తొలగించిన డీపీవో శిరీషరాణి
- నాకు జరిగిన అన్యాయంపై పిఠాపురం కార్యాలయంలో పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- అనకాపల్లి కలెక్టర్, డీపీవోలపై పంచాయతీ కార్యదర్శి సమిహ విమర్శలు



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న బాధితురాలు సమిహ

అల్లిపురం (విశాఖ): తనను అన్యాయంగా ఉద్యోగం నుంచి తొలగించి, తనను, తన కుటుంబాన్ని రోడ్డున పడేశారని, తనకు ఆత్మహత్యే శరణ్యమని, ఇందుకు అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) శిరీషరాణి, కలెక్టర్ విజయ కృష్ణన్‌లే బాధ్యులని ఈదడం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన సమిహ తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, ప్రతిపక్షనేత జగన్‌మోహన్‌రెడ్డిలు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. 2014లో దివంగత సీఎం వైఎస్సార్ దయ వల్ల ముస్లిం రిజర్వేషన్‌లో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సంపాదించానన్నారు. సర్వీసు మొత్తం దాదాపు మూరుమూల పంచాయతీల్లోనే సాగినట్లు తెలిపారు. పలుమార్లు తన తల్లికి బాగాలేదని బదిలీ చేయాలని కోరినా అధికారులు పట్టించుకోలేదన్నారు. అర్జీలు పెట్టుకోగా చివరికి పాయకరావుపేటలోని ఈదడం పంచాయతీలో పోస్టింగ్ ఇచ్చారని పేర్కొన్నారు. తన విధుల్ని సక్రమంగా నిర్వహించుకుంటున్నా.. అకారణంగా జీతం నిలిపేశారని ఆరోపించారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. మునగపాకలోని తోటాడ పంచాయతీకి డిప్యుటేషన్ కోరగా, పలాపు అనందపురం పంచాయతీలో పోస్టింగ్ ఇచ్చారని పేర్కొన్నారు.

వరుసగా వేధింపులు

2023 జూలైలో లేనిపోని ఆరోపణలతో ఫోర్జరీ కేసు పెట్టి తనను సస్పెండ్ చేశారని సమిహ వివరించారు. 2024 ఆగస్టు 22 వరకు ఎంక్వయిరీ చేయకుండా డీపీవో శిరీషరాణి 'రిటైర్‌మెంట్ యాజ్ మేజర్ పనిష్‌మెంట్'అని ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. దీనిపై హోం మినిష్టర్ అనితకు ఫిర్యాదు చేయడానికి వెళితే, గత ప్రభుత్వ ఎమ్మెల్యేలు కన్నబాబు రాజు, గొల్ల బాబూరావులపై లైంగిక వేధింపుల కేసు పెట్టాలని తనపై ఒత్తిడి తీసుకువచ్చారని వెల్లడించారు. అసలు వారిని ఏనాడూ ప్రత్యక్షంగా, పరోక్షంగా కలిసిందే లేదని పేర్కొన్నారు. తనకు జరిగిన అన్యాయంపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసేందుకు వెళితే.. తనపై జూనియర్ అసిస్టెంట్‌తో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయించారని తెలిపారు. ఒక మహిళగా తాను ఫిర్యాదు చేస్తే స్పందించని పోలీసులు, అతని ఫిర్యాదుపై మాత్రం కేసు నమోదు చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను పిఠాపురం కార్యాలయం, మంగళగిరి కార్యాలయానికి పలుమార్లు వెళ్లి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆక్షేపించారు. న్యాయం జరగకపోతే కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్య చేసుకోవడమే శరణ్యమని వాపోయారు. ఇప్పటికైనా సీఎం, డిప్యూటీ సీఎం స్పందించి తన ఉద్యోగం తనకు ఇప్పించాలని, నిలిపివేసిన జీతం, పెండింగ్ బిల్లుల్ని చెల్లించాలని కోరారు.

నూకాంబికకు ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు

- భక్తుల రాకపోకలకు నాలుగు ప్రధాన రహదారుల గుర్తింపు
- దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శోభారాణి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శోభారాణి, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో వెంపల రాంబాబు

అనకాపల్లి: నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను రాష్ట్ర పండగగా గుర్తించినందున ప్రభుత్వం నుంచి అమ్మవారి జాతరకు పట్టువస్త్రాలు సమర్పించడం జరుగుతుందని దేవదాయశాఖ సహాయ కమిషనర్ కె.శోభారాణి చెప్పారు. స్థానిక గవర పాలెం ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈనెల 28 నుంచి వచ్చే నెల 27వ తేదీ వరకు అమ్మవారి పండగ జరుగుతుందన్నారు. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ప్రధానమైన నాలుగు రహదారులు గుర్తించామని, భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. అమ్మవారి జాతరకు ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు కాకినాడ, రాజమహేంద్రవరం నుంచి ప్రత్యేక బస్సులను ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్లబాబు) మాట్లాడుతూ నూకాంబిక అమ్మవారి ఆలయం చుట్టూ ఉన్న పొలాల్లో నెల రోజులపాటు అమ్మవారి జాతరకు రైతులు తమ వంతు సహాయం అందిస్తున్నారని చెప్పారు. ప్రతి ఆదివారం అమ్మవారి దర్శనానికి సుమారు లక్షమంది భక్తులు దర్శనం చేసుకుంటారని అంచనా వేస్తున్నామన్నారు. ఆలయ ఈవో వెంపల రాంబాబు మాట్లాడుతూ ఆలయానికి వచ్చే నాలుగు ప్రధాన రహదారుల్లో 29 సీసీ కెమెరాలు, ఆలయం వద్ద 20 కూలర్లు, మెడికల్ క్యాంపులు, బాలింతలు, దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక దర్శనం కల్పిస్తామని, పిల్లలకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేస్తామన్నారు. ఈ ఏడాది ప్రత్యేక కార్యాలయం ప్రత్యేక పీఆర్వో కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష వచ్చే నెల 13కు వాయిదా

నర్సీపట్నం, చీడికాడ: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షల తేదీ మార్పు చేసినట్లు నర్సీపట్నం, కోనాం పాఠశాలల ప్రిన్సిపాళ్లు ఎ.రాజేశ్వరి, సీహెచ్.హిమాచల వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఏప్రిల్ 6వ తేదీన నిర్వహించాల్సిన ప్రవేశ పరీక్షను 13వ తేదీకి వాయిదా వేసినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ మార్పును దరఖాస్తుదారులు గమనించాలని కోరారు.

దేశంలో ఎలక్ట్రిక్ రైలు...

దేశంలో ఎలక్ట్రిక్ రైలు **కార్యక**లాపాలు ప్రారంభమై వందేళ్లు **పూర్త**య్యాయి. ఈ శతాబ్ది వేడుకల సం**దర్భంగా** వాల్తేరు రైల్వే డివిజన్ సరికొత్తగా సం**బరాలు** చేసుకుంది. ఎలక్ట్రికల్ రైల్వే వ్యవస్థకు **చిహ్నం**గా థీమ్ బేస్డ్ స్పెషల్ ఇంజిన్‌ను రూ**పొందిం**చింది. ఈ ఇంజిన్‌ను ప్రశాంతి ఎక్స్‌**ప్రెస్‌కు** అనుసంధానించింది. త్రివర్ణ పతాకం **ఐకానిక్**గా.. విశాఖ చరిత్రను, విశిష్టతనుస్ఫురిస్తూ రైల్వే యంత్రాంగం 'విశాఖ విజయ రథం' పేరుతో ఈ అద్భుతమైన ఆవిష్కరణ చేసింది. – సాక్షి, విశాఖపట్నం

వందేళ్ల జ్ఞాపకం..
విశాఖ విజయ రథం

- ఎలక్ట్రికల్ రైల్వే వ్యవస్థకు వందేళ్లు
- థీమ్ బేస్డ్ ఇంజిన్ రూపకల్పన
- విశాఖ ఘనత చాటేలా వాల్తేరు లోకోషెడ్ శ్రద్ధ



ఎలక్ట్రిక్‌లోకో షెడ్ రూపొందించిన విశాఖ విజయరథం



ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు విశాఖ విజయరథం అనుసంధానాన్ని ప్రారంభిస్తున్న డీఆర్ఎం లలిత్‌బోరా, అధికారులు

బాంబే విక్టోరియా టెర్మినస్ (ప్రస్తుతం సీఎస్ఎంటీ), కుర్లా మధ్య 1925 ఫిబ్రవరి 3న మొదటి ఎలక్ట్రిక్ రైలు పరుగులు పెట్టింది. ఈ చారిత్రక రోజున భారతీయ రైల్వే వ్యవస్థ ఒక అద్భుతమైన మైలురాయిని అందుకుంది. ఆ తర్వాత ఇండియన్ రైల్వే వరుస విజయాలతో దూసుకుపోయింది. వందేళ్ల పండగకు ప్రతీకగా, వాల్తేరు రైల్వే డివిజన్ సరికొత్త ఆలోచనతో అద్భుతాన్ని ఆవిష్కరించింది. దేశంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లలో ఒకటైన వాల్తేరు లోకోషెడ్ ఆధ్వర్యంలో థీమ్ బేస్డ్ లోకోను రూపొందించింది. దీనికి విశాఖ విజయరథంగా నామకరణం చేశారు. డబ్ల్యూఏపీ–7 (నం.39145)తో రూపొందించిన ఎలక్ట్రిక్ లోకోను బుధవారం విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి డీఆర్ఎం లలిత్‌బోరా జెండా ఊపి ప్రారంభించారు. ఏడీఆర్ఎం (ఇన్‌ఫ్రా) ఈ సీతారామ్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్ సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ బి.షణ్ముఖరావు నేతృత్వంలో రూపొందించిన ఈ లోకోమోటివ్‌ను బెంగళూరు–భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు అనుసంధానించారు.

త్రివర్ణపతాకం.. విశాఖ వైభవం

వాల్తేరు ఎలక్ట్రిక్ లోకో షెడ్ 39145 నంబర్ గల WATE WAP–7 లోకోను రూపొందించినప్పుడు కీలక అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. దేశ గౌరవాన్ని ఇనుమడింపజేసేలా.. త్రివర్ణ పతాకంతో శోభిల్లేలా లోకో మొత్తం ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. అంతేకాదు విశాఖ నగరపు ప్రత్యేకతలను ప్రపంచానికి తెలియజేసేలా కొన్ని ముఖ్యమైన చిహ్నాలను కూడా దీనిపై ముద్రించారు. ఈ లోకో ఇంజిన్‌పై తూర్పు నౌకాదళానికి గుర్తుగా జలాంతర్గామి, విశాఖపట్నం పోర్టు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింహాచలం ఆలయం, పారిశ్రామిక హబ్‌గా గుర్తింపు పొందిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్ బొమ్మలు కనువిందు చేస్తున్నాయి. ఈ ప్రత్యేకమైన లోకో విశాఖ నగరానికి, భారతీయ రైల్వేకు గర్వకారణంగా నిలుస్తోంది.

కర్బన ఉద్గారాల నియంత్రణలో కీలకం..

శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు కర్బన ఉద్గారాలను నియంత్రించేందుకు ఇండియన్ రైల్వేస్ ఈ ఎలక్ట్రిక్ లోకోలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ అద్భుత ఘట్టానికి వందేళ్లు పూర్తవ్వగా, ఈ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా విశాఖ విజయరథం రూపొందించడం శుభపరిణామం. వాల్తేరు ఎలక్ట్రిక్ లోకో షెడ్ 336 లోకోల నిర్వహణ బాధ్యతలు చూస్తోంది. నిరంతరం ఎంతో పని ఒత్తిడి ఉన్నా.. వందేళ్ల ఉత్సవానికి గుర్తుగా అద్భుతమైన లోకోను తీర్చిదిద్దినందుకు షెడ్ సిబ్బందికి కృతజ్ఞతలు. ఎలక్ట్రిక్ లోకోల రాకతో భారతీయ రైల్వే ప్రయాణ వేగాన్ని క్రమంగా పెంచుకుంటూ దూసుకుపోతోంది.

– లలిత్‌బోరా, వాల్తేరు డీఆర్ఎం

చోరీ సొత్తు రికవరీ



చోడవరం పోలీసు స్టేషన్‌లో రికవరీ చేసిన బంగారు నగలు చూపిస్తున్న ఎస్ఐలు జోగారావు, నాగకార్తీక్

చోడవరం : మండలంలో పి.ఎస్. పేట గ్రామానికి చెందిన కొల్లి లక్ష్మి తన ఇంట్లో ఉంచిన బంగారు వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని పోలీసులకు ఆమె బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐలు నాగకార్తీక్, జోగారావు గురువారం వివరాలు తెలిపారు. కొల్లి లక్ష్మి ఈ నెల 25 వ తేదీ ఉదయం 8 గంటల సమయంలో ఇంటికి తాళాలు వేసి, పొలానికి వెళ్లింది. తిరిగి ఉదయం 11 గంటల సమయంలో ఇంటికి వచ్చేసరికి తన ఇంట్లో ఉంచిన రెండు పేటలు బంగారు పుస్తెలు తాడు(3 తులాలు), నల్లపూసల దండ (రెండున్నర తులాలు) అపహరణకు గురైనట్టు గుర్తించింది. దీనిపై లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చోడవరం ఎస్ఐ నాగకార్తీక్ కేసు నమోదు చేశారు. సంఘటన స్థలానికి పోలీసు సిబ్బంది, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో దర్యాప్తు చేస్తుండగా, ఈ చోరీ చేసిన వారు పోలీసులకు భయపడి, ఈ వస్తువులను తెచ్చి బాధితురాలి ఇంట్లో వేశారని తెలిపారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికలు

అచ్యుతాపురం రూరల్ : రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా రగ్బీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కూండ్రపు వెంకునాయుడు తెలిపారు. బుధవారం అధ్యక్షుడు డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ రగ్బీ క్రీడకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రభుత్వం 3 శాతం కేటాయించారన్నారు. ఈ నెల 29న జరగబోయే జిల్లా స్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఏప్రిల్ నెలలో జరగబోయే రాష్ట్ర స్థాయి క్రీడలకు అనకాపల్లి జిల్లా తరపున ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. వివరాలకు 8886141984, 8074714464 సంప్రదించాలన్నారు.

12వ పీఆర్సీ చైర్మన్ నియామకం ఎప్పుడు?

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న నక్క వెంకటేశ్వర్లు

అనకాపల్లి : 2023 జూలై 1 నుంచి రావాల్సిన 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ని నేటివరకూ ప్రభుత్వం నియమించలేదని, కూటమి ప్రభుత్వం తక్షణమే నియమించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా యూటీఎఫ్ ఆఫీస్ బేరర్స్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన గత ప్రభుత్వం 12వ పీఆర్సీ చైర్మన్ నియమించినప్పటికీ అతనికి ఎలాంటి విధివిధానాలు రూపొందించకపోవడం వల్ల రిజైన్ చేసి వెళ్లిపోయారని, వచ్చిన కొత్త ప్రభుత్వం తొమ్మిది నెలలు పూర్తవుతున్నా నేటి వరకూ 12వ పీఆర్సీ చైర్మన్‌ను నియమించలేదన్నారు. చైర్మన్ నియామకం విధివిధానాలను రూపొందించి, సంఘాలతో చర్చించి వివిధ రకాలైన ప్రతిపాదనలు పెట్టడానికి చాలా సమయం తీసుకుంటుంది కనుక, తక్షణం చైర్మన్‌ని నియమించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ 29 శాతాన్ని ప్రకటించాలని ఆయన కోరారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పాత బకాయి రూ.7వేలు కోట్లు చేసినప్పటికీ, నేటికీ రూ.25 వేల కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ బకాయిలలో సరెండర్ లీవ్ ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం సరికాద ఆయన విమర్శించారు. జీవో 117 కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 12,512 ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయని, ఈ జీవోను తక్షణమే రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ పాఠశాలను అన్ని అంగులతో ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడానికి ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సు శ్రీకాకుళం కేంద్రంలో మార్చి 31న జరుగుతుందని, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు వెంకటరావు, సహాధ్యక్షుడు రొంగలి అక్కు నాయుడు, జిల్లా కార్యదర్శులు జి.ఎస్.ప్రకాష్, ఎస్.శేషు కుమార్, మాకిరెడ్డి రాజనాయుడు, రమేష్ రావు, కోశాధికారి జోగా రాజేష్, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లయ్య బాబు, ఎం.వి.అప్పారావు, గేదెల శాంతి దేవి పాల్గొన్నారు.

ఉపాధి పనులు సక్రమంగా చేపట్టాలి



ప్రజావేదికలో సమీక్షిస్తున్న డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి

మాడుగుల రూరల్ : ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టరు ఆర్. పూర్ణిమాదేవి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ ఆవరణలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక బుధవారం నిర్వహించారు. ఈ ప్రజా వేదికలో మండలంలో 29 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 4 వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై గ్రామాల్లో సామాజిక తనిఖీ బృంద సభ్యులు తనిఖీ నిర్వహించారు. ఈ ప్రజావేదికలో ఏప్రిల్ 1 వ తేదీ 2023 నుంచి మార్చి 31, 2024 వరకు చేపట్టిన 1707 పనులకు సంబంధించి రూ.15 కోట్ల 56 లక్షలు వేతనాలు ఉపాధి కూలీలకు చెల్లించామన్నారు. మెటీరియల్ రూపంలో రూ.5. 73 కోట్లు వ్యయం చేశామన్నారు. కొన్ని గ్రామాల్లో ఉపాధి పనుల్లో కొంత మంది ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడినట్టు సామాజిక తనిఖీలో వెల్లడి కావడంతో ఫీల్డ్ అసిస్టెంట్లుపై ప్రాజెక్టు డైరెక్టరు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో వేసిన మొక్కలు వాటి వివరాలు కూడా ప్రజా వేదికలో సమీక్షించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడుబూరె బాబూరావు పనులకు సంబంధించి అధికారులతో కలిసి సమీక్షించారు. పథకం విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి, సహాయ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, రాష్ట్ర రిసోర్సు పర్సన్ రాజేంద్ర, ఎంపీడీవో అప్పారావు, మండల ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసరావు, పెద్దేరు జలాశయం ప్రాజెక్టు చైర్మన్ అద్దిపల్లి జగ్గారావు, నాయకులు ఉండూరు దేముడు, శివాజీ, ఎంపిటిసి సభ్యులు మైచర్ల సన్యాసిరావు పాల్గొన్నారు. కాగా ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి జూన్ వరకు ఐదు పనులకు సంబంధించి ప్రాధాన్యం కల్పిస్తామని ప్రజావేదికలో తీర్మానించారు. ప్రతి శుక్రవారం రోజ్‌గార్ దివస్ సందర్భంగా కూలీలకు అవగాహన కల్పించడం గురించి ప్రజా వేదికలో తీర్మానించారు.

దేవరాపల్లి ఎంపీపీ ఎన్నికకు పక్కాగా ఏర్పాట్లు



ఎన్నిక ప్రక్రియ వివరాలను వెల్లడిస్తున్న ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, డిఎల్‌డీవో మంజులవాణి



ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నిక ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి మంజులవాణి, ఎంపీడీవో సువర్ణరాజు

- సీసీ కెమెరాల నిఘా, పోలీస్ బందోబస్తు నడుమ ఎన్నిక నేడు
- ఉదయం 11 గంటలకు చేతులు ఎత్తే పద్ధతిలో ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ
- ఎన్నిక అనంతరం ధ్రువీకరణ పత్రం అందజేత, ప్రమాణ స్వీకారం
- ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, డీఎల్‌డీవో మంజులవాణి వెల్లడి

దేవరాపల్లి: దేవరాపల్లి ఎంపీపీ ఎన్నిక ప్రక్రియను గురువారం పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, డీఎల్‌డీవో ఎస్. మంజులవాణి వెల్లడించారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సీసీ కెమెరాలు, పోలీస్ బందోబస్తు నడుమ ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ జరుగుతుందన్నారు. ఎన్నిక నిర్వహించే ఎంపీడీవో కార్యాలయం వద్ద 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందన్నారు. గతంలో కేటాయించిన బీసీ మహిళ రిజర్వేషన్ మేరకు ఎంపీపీ ఎన్నిక జరుగుతుందన్నారు. ఉదయం 11 గంటలకు ముందుగా ఎంపీపీ పదవికి పోటీ చేసే అభ్యర్థులను ఆయా పార్టీలకు చెందిన సభ్యులు బలపరుస్తారన్నారు. అనంతరం చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నిక నిర్వహించి ఫలితాలను ప్రకటిస్తామన్నారు. ఎన్నిక ప్రక్రియ ముగిసిన అనంతరం గెలుపొందిన సదరు ఎంపీపీకి ధ్రువీకరణ పత్రం అందజేయడంతో పాటు వెంటనే ప్రమాణ స్వీకారం కూడా చేయిస్తామన్నారు.

చిన్నారులకు ఆటపాటలతో నాణ్యమైన విద్య

- జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ పీడీ అనంతలక్ష్మి
- కాశీపురంలో శిక్షణ తరగతుల సందర్శన



కాశీపురంలో శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న పీడీ అనంతలక్ష్మి

దేవరాపల్లి: పిల్లలకు పోషకాహారంతో పాటు ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కె.అనంతలక్ష్మి అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ఈ మేరకు మండలంలోని కాశీపురం హైస్కూల్లో జరుగుతున్న పోషణ్‌బి-పడాయిబి కార్యక్రమాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో బోధించిన అంశాలను ఆకలింపు చేసుకొని అంగన్‌వాడీ కేంద్రాలలో అమలు చేయాలని సూచించారు. పోషణ్ ట్రాకర్‌లో లబ్ధిదారులతో తప్పనిసరిగా ఎఫ్ఆర్ఎస్ వేయించాలని ఆదేశించారు. స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో మంగతాయారు, సూపర్‌వైజర్లు సుశీల, రాములమ్మ, ఆదిలక్ష్మి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి



రోలుగుంటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు

రోలుగుంట : తూర్పు గోదావరి జిల్లాలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పులతో దండవేసి అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలంటూ అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి రోలుగుంటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్రంలో ఎక్కడ అవమానం జరిగినా సహించబోమని అన్నారు.135 అడుగుల ఎత్తున అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి చట్టసభలో గౌరవిస్తున్నా ఇలాంటి హేయమైన సంఘటనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని సంఘ సభ్యులు తెలిపారు. బాధ్యులను అరెస్టు చేయకుంటే ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే ప్రభుత్వానికి తిప్పలు తప్పవని హెచ్చరించారు.

బైక్ ఢీకొని మహిళ మృతి



మృతురాలు రత్నం (ఫైల్)

నక్కపల్లి : జాతీయ రహదారిపై ఉద్దండపురం జంక్షన్‌లో బైక్ ఢీకొనడంతో మహిళ మరణించింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మేకల రత్నం (52) ఈనెల 21వ తేదీన రోడ్డు దాటుతుండగా ఉద్దండపురం నుంచి వేంపాడు వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది, తీవ్రంగా గాయపడ్డ ఈమెను చికిత్సకోసం విశాఖపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మరణించిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి గోవాడ సుగర్స్ సభ్య రైతులకు బకాయిల చెల్లింపు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో 2024–25 క్రషింగ్ సీజన్‌లో చెరకు సరఫరా చేసిన సభ్య రైతుల బ్యాంకు ఖాతాలకు గురువారం నుంచి బకాయి సొమ్ము జమ చేస్తున్నట్లు ఫ్యాక్టరీ ఎండీ వి.వి. సన్యాసినాయుడు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 21వ తేదీ నుంచి ఫిబ్రవరి 4 వరకు గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి చెరకును సరఫరా చేసిన సభ్య రైతులకు టన్నుకు రూ.3000ల చొప్పున రైతుల ఖాతాలో వేస్తామన్నారు. 3123 మందికి రూ.5 కోట్ల 84 లక్షల నగదును నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు షెడ్యూల్ ప్రకారం జమ చేస్తామని ఎండీ సన్యాసినాయుడు తెలిపారు.

బాలికను గర్భవతిని చేసిన వివాహితుడు

ఎంవీపీకాలనీ (విశాఖ): ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను గర్భవతిని చేసిన ఘటనలో సీహెచ్ సీతయ్య అనే వ్యక్తిపై ఎంవీపీ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వాసవానిపాలేనికి చెందిన 14 ఏళ్ల బాలిక 21వ వార్డులోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతోంది. ఆమె తల్లి, అన్నయ్యతో కలిసి నివసిస్తోంది. అదే ప్రాంతానికి చెందిన వివాహితుడైన సీహెచ్ సీతయ్య గత ఏడాదిగా బాలికను ప్రేమ పేరుతో లోబరుచుకుంటున్నాడు. ఈ ఏడాది జనవరిలో ఓ ఇంటికి తీసుకెళ్లి ఆమెపై లైంగిక దాడి చేశాడు. ఆ తర్వాత కూడా పలుమార్లు ఆమెతో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. బాలిక ప్రవర్తనలో మార్పులు గమనించిన తల్లి అనుమానంతో ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్ష చేయించగా, గర్భవతి అని తేలింది. దీంతో ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీతయ్యపై కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్య

పెదగంట్యాడ (విశాఖ): వాంబే కాలనీలో దేరింగు వెంకట పవన్ కుమార్ (28) తల్లి, తమ్ముడితో కలసి నివాసం ఉంటున్నాడు. ఇంటర్ వరకు చదువుకున్నాడు. డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ప్రస్తుతం ఖాళీగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఆర్థిక పరిస్థితుల కారణంగా మనస్తాపం చెందిన ఆ యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ నజీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఆస్తి పన్ను పెంపును ఉపసంహరించుకోవాలి



జోన్ ఇన్‌చార్జికి వినతిపత్రం అందిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అనకాపల్లి టౌన్: ఆస్తి పన్నును సమీక్షిస్తామని అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మున్సిపల్ సవరణ చట్టం 44–2020ని వెంటనే రద్దు చేసి, ఆస్తి పన్ను పెంపును వెంటనే నిలిపివేయాలని జిల్లా ప్రజాల సంఘాల నేతలు డిమాండ్ చేశారు. స్థానిక జీవీఎంసీ కార్యాలయ జోన్ ఇన్‌చార్జి నాగేశ్వరరావును వారు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆస్తి విలువ పెంచి అందుకు తగ్గట్టుగా ఆస్తి పన్నును పెంచడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు బొడ్డేల అప్పారావు, చిన్ని యాదవ్, బొడ్డు సోమరాజు, బొబ్బిలి గోవిందరాజు, వాసుపల్లి తాతయ్యలు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నూకాంబిక జాతర



తాకాశివీధి నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి: స్థానిక తాకాశివీధి నూకాంబిక అమ్మవారి జాతరను గురువారం ప్రారంభించనున్నట్టు ఆలయ చైర్మన్ తాకాశి రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి అమ్మవారు ఘటాలను పట్టణంలో పురవీధుల గుండా ఊరేగిస్తామన్నారు. 28న సాయంత్రం కొత్త అమావాస్య జాతర సాయంత్రం 6 నుంచి మరుసటి రోజు ఉదయం వరకూ ఉంటుందన్నారు. భక్తులను దృష్టిలో పెట్టుకుని నేలవేషాలు, మూడు స్టేజ్ ప్రోగ్రాంలు నిర్వహించనున్నామన్నారు. ఏప్రిల్ 27వ తేదీ వరకూ నెల రోజుల పాటు అమ్మవారి జాతర జరుగుతుందన్నారు. ఆదివారం సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

సీసీ రోడ్ల పనుల పరిశీలన

కశింకోట: మండలంలోని చింతలపాలెం గ్రామ కాలనీలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద సిమెంట్ రోడ్ల నిర్మాణం బుధవారం చేపట్టారు. పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాలరావు పనులను పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను కోరారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 4,730 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,700	4,190
మొదటి రకం	3,660	4,210
రెండో రకం	3,140	3,780
మూడో రకం	2,950	3,110

అనకాపల్లి సినిమాలు

రాజా :	రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
సత్యనారాయణ స్క్రీన్-1:	టుక్‌టుక్
సత్యనారాయణ స్క్రీన్-2:	యుగానికి ఒక్కడు
పర్తిసాయి	: కోర్ట్
షిర్డీసాయి	: పెళ్లికాని ప్రసాద్
వెంకటేశ్వర(ఉదయం)	: షణ్ముక
వెంకటేశ్వర(మ్యాట్నీ, 1,2 షోలు):	న్యూ పోలీస్ స్టోరీ
శ్రీసత్య	: సలార్
రామచంద్ర	: ఛావా

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 29 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–4 యూనిట్లు, బీ పాజిటివ్–13 యూనిట్లు, ఓ పాజిటివ్–11 యూనిట్లు, ఏబీ పాజిటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 324 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924–223595 నంబరులో సంప్రదించవచ్చు.

రయ్.. రయ్..



రోడ్డుపై వాహనాల రాకపోకలు



కశింకోట–మునగపాక గ్రామాల మధ్య పొలాల మీదుగా నిర్మించిన తారురోడ్డు

- వంతెనల మినహా అందుబాటులోకి కశింకోట–మునగపాక రహదారి
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో పనులు ప్రారంభం
- ఆనందం వ్యక్తం చేస్తున్న రెండు మండలాల ప్రజలు

కశింకోట: గత వైఎస్సార్‌సీపీ హయాంలో తలపెట్టిన పలు అభివృద్ధి పనులు తాజా పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయి. అలా కశింకోట–మునగపాక గ్రామాల మధ్య పొలాల మీదుగా తలపెట్టిన రోడ్డు నిర్మాణం పలు చోట్ల వంతెనల మినహా ఎట్టకేలకు పూర్తయింది. వంతెనలు పూర్తి చేసి ఈ రోడ్డు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే కశింకోట, మునగపాక, అచ్యుతాపురం మండలాల ప్రజలకు దగ్గరి మార్గం కానుంది. కశింకోట గ్రామం వద్ద కాశీమదుం గ్రోయిన్ నుంచి నుంచి పెదపాడు మీదుగా మునగపాకకు ప్రధానమంత్రి సడక్ యోజన కింద రూ.5.7 కోట్లతో సుమారు 7.5 కిలో మీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణం రెండేళ్ల క్రితం చేపట్టారు. కశింకోట నుంచి పెదపాడు గ్రామం వరకు మూడున్నర కిలోమీటర్ల మేర గతేడాది వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తి చేశారు. దీంతో కశింకోట నుంచి ప్రధానంగా అచ్యుతాపురం మండలంలోని గ్రామాలకు దగ్గరి దారిగా రవాణా సదుపాయం మెరుగుపడింది. సుమారు 9 కిలో మీటర్ల మేర దూరం తగ్గింది. గతంలో అనకాపల్లి మీదుగా అచ్యుతాపురం చేరుకోవడానికి 22 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వచ్చేది. ఇప్పుడు కేవలం 13 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే సరిపోతుంది. ప్రస్తుతం కశింకోటతో పాటు చుట్టు పక్కల ప్రాంత ప్రజలు, వాహన చోదకులు, అచ్యుతాపురం బ్రాండెక్స్, ఇతర పరిశ్రమలకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు ఈ మార్గం మీదుగానే రాకపోకలు సాగిస్తున్నారు.

పెదపాడు నుంచి మునగపాక వరకు దాదాపు నాలుగు కిలో మీటర్ల మేర తారు రోడ్డు వేశారు. అయితే వీటి మధ్య మూడు చోట్ల కాలువలపై వంతెనలు నిర్మించాల్సి ఉంది. కాలువల్లో నీరు ఉండటం వల్ల వంతెన నిర్మాణాలకు అవరోధం కలిగిందని అధికారులు చెబుతున్నారు. అరబుపాలెం, మునగపాక తదితర గ్రామాలకు రాకపోకలకు ప్రస్తుతం ఈ రోడ్డు ఉపయోగపడుతోంది. వంతెనలు పూర్తయితే పెద్ద వాహనాల రాకపోకలకు అవకాశం కలగనుంది. ఈ రోడ్డు లేనప్పుడు గతంలో కశింకోట, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అనకాపల్లి మీదుగా మునగపాకకు 11 కిలోమీటర్ల దూరం ప్రయాణించి చేరుకోవలసి వచ్చేది. ఇప్పుడు 3.5 కిలో మీటర్లు మేర దూరం తగ్గుతోంది. ఏడున్నర కిలో మీటర్ల దూరంతో చేరుకోవచ్చు. పైగా రద్దీ ఎక్కువగా ఉండకపోవడం, పొలాల మీదుగా కావడం వల్ల చల్లదనంతో పాటు కాలుష్యం లేకుండా ప్రయాణించడానికి అవకాశం కలుగుతోంది. గతంలో మట్టి రోడ్డు కావడంతో రైతులు వ్యవసాయ ఉత్పత్తులను ఇళ్లకు, మార్కెట్‌కు తరలించడానికి నానా ఇబ్బంది పడేవారు. ఇప్పుడు రోడ్డు నిర్మాణంతో ఆ ఇబ్బంది తొలగింది. రోడ్డు సదుపాయం వల్ల పంట భూములకు ఎక్కువ ధరలు పలుకుతుండటంతో రైతులు సంబర పడుతున్నారు. అసంపూర్తిగా ఉన్న వంతెనల నిర్మాణం పూర్తి చేసి పూర్తి స్థాయిలో రోడ్డు అందుబాటులోకి తీసుకు రావడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సులువుగా రాకపోకలు



కశింకోట నుంచి పెదపాడు మీదుగా మునగపాక వరకు ఉన్న రోడ్డు మట్టితో నిండి అధ్వానంగా ఉండేది. రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడేవారం. ఇప్పుడు తారు రోడ్డు నిర్మాణంతో రాకపోకలు సాగించడానికి, దుక్కులు దున్నడానికి, పశువులను తీసుకెళ్లడానికి, వ్యవసాయ ఉత్పత్తులు తరలించడానికి అనువుగా ఉంది.

– కాండ్రేగుల వెంకట అప్పారావు, రైతు, కశింకోట

దూరం తగ్గింది



గతంలో మునగపాక, అచ్యుతాపురం ప్రాంతాలకు అనకాపల్లి మీదుగా రాకపోకలు సాగించేవారం. దీంతో దూరం ఎక్కువగా ఉండేది. ఇప్పుడు పొలాల మీదుగా దగ్గరి దారిగా తారు రోడ్డు నిర్మాణంతో సౌకర్యవంతంగా ఉంది. దూరం కూడా తగ్గింది.

– సేనాపతి సూర్యప్రకాష్, వ్యాన్ డ్రైవర్, కూండ్రం

ఏడాది ఆఖరుకు వంతెనలు పూర్తి

కశింకోట–మునగపాక గ్రామాల మధ్య దూరం తగ్గడంతో పాటు రైతులు, ప్రజలు, వాహన చోదకులకు సౌకర్యవంతంగా ఉండడం కోసం రూ.5.7 కోట్లతో ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద తారు రోడ్డు నిర్మాణం చేపట్టాం. రోడ్డు భాగం దాదాపు పూర్తయింది. మూడు వంతెనల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. కాలువల్లో నీరు ఉండటం వల్ల పనులు నిలిచిపోయాయి. ఈ ఏడాది ఆఖరు నాటికి వంతెనలు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం

– వేణుగోపాలరావు, డీఈ, పంచాయతీరాజ్, అనకాపల్లి

26వ రోజుకు ఆర్టీసీ ఉద్యోగుల దీక్షలు



డిపో ఎదుట నిరాహార దీక్ష చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

అనకాపల్లి టౌన్: వన్ మ్యాన్ సర్వీసులను ఇతర డిపోల వలే అల్ట్రా డీలక్స్ సర్వీసుల వరకు మాత్రమే పరిమితం చేయాలని ఎన్‌ఎంయుఏ డిపో సెక్రటరీ కె.ఎన్.బి.రమేష్ డిమాండ్ చేశారు. సస్పెండ్ చేసిన ఉద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ స్థానిక డిపో ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 26వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1–2019 సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిపో అధ్యక్షుడు ఎ.ఎన్.రావు, బి.అన్నవరం, కె.బి.నాయుడు, టి.వి.నాయుడు, ఎస్.ఆర్.బాబు, తదితరులు పాల్గొన్నారు.

కేఎన్‌ఆర్ పేటలో రజకుల పండగ

అనకాపల్లి: మండలం, పట్టణంలో రజకుల అందరూ ఐక్యంగా ఉంటూ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని అనకాపల్లి రజక సంఘం అధ్యక్షుడు చూచుకొండ రమణ అన్నారు. మండలంలో జీవీఎంసీ విలీన గ్రామమైన కొత్తూరు నర్సింగరావుపేటలో బుధవారం రజక దోబీకానా వద్ద బల్లల పండగను పురస్కరించుకుని కులదైవమైన మడేలేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రజక కులస్తులు జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని ఆయన కోరారు. మధ్యాహ్నం కుటుంబ సమేతంగా వనభోజన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, 84వ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి, రజక సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'గోవాడ' చెరకు రైతుల బకాయిలను తక్షణమే చెల్లించాలి

అనకాపల్లి: చోడవరం(గోవాడ) సహకార సుగర్ ఫ్యాక్టరీ రైతులకు చెరుకు బిల్లులు, కార్మికులకు జీతాలు చెల్లింపునకు తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీల క్రషింగ్ నిలిపివేశాక, చెరకు రైతుకు పెద్ద దిక్కుగా చోడవరం సహకార సుగర్ ఫ్యాక్టరీ ఉందని, ఫ్యాక్టరీని నమ్ముకొని చెరకు సాగుచేసి సరఫరా చేస్తున్నారన్నారు. ఈ ఏడాది క్రషింగ్ ప్రారంభం నుంచి నేటి వరకు చెరకు సరఫరా చేసిన రైతుకు యాజమాన్యం పైసా బిల్లు చెల్లించలేదని, పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నారన్నారు. గతేడాది బకాయి రూ.7.16 కోట్లు, ఈ ఏడాది బకాయి బిల్లు రూ.25.14 కోట్లు రైతులకు చెల్లించవలసి ఉందని, కార్మికులకు రూ.7 కోట్లు జీతం బకాయి ఉందని చెప్పారు. ఈ ఏడాది ఫ్యాక్టరీ క్రషింగ్ ఆరంభం నుంచి కార్మికులకు జీతాలు చెల్లించలేదని, . రైతు, కార్మిక కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. కలెక్టర్ విజయకృష్ణన్ తక్షణమే చర్యలు తీసుకుని చెరకు రైతులు, కార్మికులకు జీతాలు చెల్లించాలని కోరారు. ఫ్యాక్టరీలో రూ.17 కోట్ల విలువైన పంచదార నిల్వలు, రూ.8 కోట్లు విలువైన మొలాసిస్ విక్రయానికి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

సబ్ జైల్‌ను తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి



ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షియాజ్ ఖాన్

నర్సీపట్నం : సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్, జూనియర్ సివిల్ జడ్జి రోహిత్ బుధవారం స్థానిక సబ్‌జైల్‌ను తనిఖీ చేశారు. ఖైదీలకు తయారు చేసిన భోజనాన్ని పరిశీలించారు. జైల్‌లో అందుతున్న సౌకర్యాలపై ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులను పెట్టుకునేందుకు ఆర్థిక స్థోమత లేని వారికి మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు అందిస్తామన్నారు. అటువంటి వారు ఎవరైనా ఉంటే వివరాలను జైల్ సూపరిండెంటెంట్ ఎం.సన్యాసిరావుకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది విజయ ప్రసాద్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న చైల్డ్ వెల్ఫేర్ సభ్యురాలు రమ్య

అచ్యుతాపురం రూరల్ : పద్దెనిమిది సంవత్సరాలలోపు పిల్లలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా సంరక్షించుకోవాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ క్షేత్ర స్థాయి సభ్యురాలు కె.ఎల్.వి.రమ్య సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమంపై బుధవారం మడుతూరు, దోసూరు గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు, చిన్న పిల్లలతో పనులు చేయించడం, భిక్షాటన చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి పిల్లలు ఎక్కడైనా తారసపడితే వెంటనే హెల్ప్ లైన్ నంబర్ 1098, 112కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రతి పంచాయతీలో మహిళా కానిస్టేబుల్ ఆధ్వర్యంలో సర్పంచ్ అధ్యక్షుడిగా ఉండి మరో 9 మందితో కూడిన ఒక కమిటీ ద్వారా బడి బయట పిల్లల్ని, పేద పిల్లల్ని, అభాగ్యుల్ని గుర్తించి కేంద్రం ప్రభుత్వం మెషిన్ వాత్సల్య అనే పథకం ద్వారా 2 సంవత్సరాల పాటు నెలకు రూ.4 వేలు అందిస్తూ ఆదుకుంటుందన్నారు. హెచ్‌ఐవీ సోకిన పిల్లలకు, హెచ్‌ఐవీ వ్యాధితో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందని రమ్య తెలిపారు. ఎవరైె పిల్లలను దత్తత తీసుకోవాలని అనుకుంటే https://cara.wcd.gov.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో మడుతూరు సర్పంచ్ మోటూరు సంజీవి, దోసూరు సర్పంచ్ నర్మాల సుజాతరామకృష్ణ, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హైవే దాటడానికి ఆపసోపాలు!



కశింకోట కూడలి వద్ద జాతీయ రహదారిని దాటడానికి అవస్థలు పడుతున్న వృద్ధులు

కశింకోట: కశింకోట కూడలిలో జాతీయ రహదారిని దాటడానికి వృద్ధులు ఆపసోపాలు పడుతున్నారు. రహదారిపై ఏకధాటిగా భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో కూడలిలో రోడ్డు దాటడం ప్రజలు, వాహన చోదకులకు తలకు మించిన భారంగా పరిణమిస్తోంది. ఇక్కడ ప్రజలు, వాహన చోదకులు రోడ్డు దాటడానికి వీలుగా సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు చిరకాలంగా కోరుతున్నారు.

భూఆధార్ రిజిస్ట్రేషన్‌కు ఈ నెలాఖరు గడువు

మునగపాక: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూఆధార్ రిజిస్ట్రేషన్‌ను ఈ నెల 31వ తేదీలోగా చేయించుకోవాలని స్థానిక వీఏఏ సింధూజ కోరారు. ప్రతి రైతు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పలు పథకాలు అమలవుతాయన్నారు. ఇందుకోసం రైతులు పాస్ పుస్తకం , వన్‌బీ, ఆధార్ కార్డు జెరాక్స్‌తో పాటు ఆధార్ లింకైన ఫోన్‌ను తీసుకువచ్చి రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

5 పంచాయతీల ఉప సర్పంచ్ పదవులకు నేడు ఎన్నిక

మునగపాక: మండలంలోని ఐదు పంచాయతీలకు గురువారం ఉప సర్పంచ్ పదవులకు ఎన్నిక జరుగుతుందని ఈవోఆర్డీ సోమరాజు తెలిపారు. గతంలో జరిగిన పంచాయతీ ఎన్నికల సందర్భంగా చేసుకున్న ఒప్పందం మేరకు ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఉప సర్పంచ్ పదవులకు ఎన్నిక జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు మునగపాక, నాగులాపల్లి, తోటాడ, రాజుపేట, నారాయుడుపాలెం పంచాయతీలలో ఎన్నిక ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ తెలిపారు. దీని కారణంగా నరసింగబిల్లి, జెట్టపురెడ్డితుని, ఏనుగుతుని, చిన్న ఏనుగుతుని, నూతనల గుంటపాలెం, సోమవరం, ఎ.ఎస్.పేట, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, గొబ్బూరు, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, జమాదులపాలెం, తాళ్లపాలెం, జి. భీమవరం, అచ్చెర్ల, మోసయ్యపేట, బంగారయ్యపేట తదితర గ్రామాలకు ఆయా సమయంలో విద్యుత్ సరఫరా ఉండబోదని, ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి టౌన్: డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం ఈ నెల 28లోగా ఫేజ్ -2 వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి కెరాజేశ్వరి తెలిపారు. షార్ట్ లిస్ట్ చేసి, ప్రాధాన్యత ప్రకారం కోచింగ్ సంస్థలు కేటాయించడానికి సర్వీసెస్ జ్ఞాన భూమి పోర్టల్ అందుబాటులో ఉందని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 28 తేదీలోగా వెబ్ ఆప్షన్ సేవ ద్వారా గుర్తింపు పొందిన శిక్షణ సంస్థలకై తమ ప్రాధాన్యతలను నమోదు చేసుకోవాలని, ఫేజ్–1 వెబ్ ఆప్షన్‌కు ఎడిట్ ఆప్షన్ లేదని ఆమె తెలిపారు.

రుణాల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ

తుమ్మపాల: ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద రుణాలు మంజూరుకు మైనారిటీ వర్గాల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏపీఎస్ఎంఎఫ్‌సీ జిల్లా అధికారి షంసున్నీసాబేగం తెలిపారు. ముస్లింలు, క్రైస్తవులు, జైనులు, సిక్కులు, బౌద్ధులు, పారశీకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తయారీ రంగానికి రూ.50 లక్షలు, సేవ రంగానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తామన్నారు. ప్రాజెక్ట్ విలువలో 15 శాతం నుంచి 35 శాతం వరకు సబ్సిడీ ఉంటుందన్నారు. ఈ పథకం దరఖాస్తుదారుల వయసు 18 సంవత్సరములు దాటి ఉండాలని, గరిష్ట వయో పరిమితి, ఆదాయ పరిమితి లేదన్నారు. తయారీ రంగంలో 10 లక్షల పైబడిన ప్రాజెక్టులకు, సేవా రంగంలో 5 లక్షలు పైబడిన ప్రాజెక్టలకు కనీసం 8 వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈ పథకం నూతన ప్రాజెక్టుకు మాత్రమే వర్తిస్తుందని ఆమె తెలిపారు.

ఆకట్టుకున్న సాంఘిక నాటక ప్రదర్శనలు



రైతు పోరాటం నాటకంలోని ఓ సన్నివేశం

మునగపాక: మునగపాకలోని పరదేశమ్మ తల్లి పండగ సందర్భంగా స్థానిక కళాకారులు మంగళవారం రాత్రి ప్రదర్శించిన రెండు సాంఘిక నాటకాలు అందరినీ ఆకట్టుకున్నాయి. రైతులే ఈ నాటకాల్లో నటించి మెప్పించారు. సంతబయల తంపరమూల విశాలాంధ్ర స్టేజీపై అద్దంలో చందమామ సాంఘిక నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ నాటకానికి రచన, దర్శకత్వం విల్లూరి లక్ష్మీ జగన్నాథ్ వహించారు. మందబయల రామాలయం వద్ద శ్రీలక్ష్మీ యూనియన్ ఆధ్వర్యంలో రైతు పోరాటం నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. స్థానిక కళాకారులు నటించి మెప్పించారు. ఈ నాటకానికి దాడి జగన్నాథరావు రచన చేయగా.. దాడి ముసిలినాయుడు దర్శకత్వం వహించారు. రెండు నాటక ప్రదర్శనలను తిలకించేందుకు కళాభిమానులు భారీగా తరలివచ్చారు.

ఏఐతో ఉపాధి అవకాశాలు



జాతీయ సదస్సు బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సదస్సు ప్రతినిధులు

అనకాపల్లి టౌన్: యువత గ్రీన్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ)పై పట్టు సాధించి ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలని ఏపీ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ వి.సందీప్ అన్నారు. దాడి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం, ఐఈఈఈ, ఐఎస్‌టీఈ ప్రొఫెషనల్ బాడీ సంయుక్త భాగస్వామ్యంతో నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఏఐ అప్లికేషన్స్ ఇన్ ఎలక్ట్రికల్ సైన్సెస్–2025 జాతీయ సదస్సు బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పారిశ్రామిక రంగంలో ముఖ్యంగా స్మార్ట్ గ్రిడ్, మైక్రో గ్రిడ్, ఎలక్ట్రికల్ మెహికల్స్ రంగాలలో ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. ఈ సమావేశంలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్ ప్రసాద్ రెడ్డి, ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ గోపాలమ్మ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కన్వీనర్ డాక్టర్ రమణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీలు



పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న వైద్యారోగ్య శాఖాధికారి రవికుమార్

అచ్యుతాపురం రూరల్ : తాగునీటి వనరులను ప్రతి రోజూ క్లోరినేషన్ చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ పి.రవికుమార్ సూచించారు. అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. వేసవి కాలంలో విద్యుత్ కోతలు అధికంగా ఉన్నందున ఐఎల్ఆర్ డీప్ ఫ్రీజర్ పనితీరును పరిశీలించారు. రోజుకు ఎంత మంది రోగులు ఓపీకి వస్తున్నారు.. బెడ్‌లు సరిపడా ఉన్నాయా? లేదా? అని పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావ్యను అడిగి తెలుసుకున్నారు. 105 రకాల మందులను డిస్‌ప్లేలో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. మరుగుదొడ్ల పరిశుభ్రత, లేబర్ రూమ్ తనిఖీ, నెలలో ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లో ఎన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారో ల్యాబ్ టెక్నీషియన్ గీతా రాణిని వివరాలు అడిగారు. టీబీ పరీక్షల శాంపిల్స్ రోజుకు ఎన్ని వస్తున్నాయని ప్రశ్నించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రభలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఫీల్డ్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వేణుగోపాల్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.రాయవరం ఎంపీపీ ఎన్నిక నేడు

ఎస్.రాయవరం: మండల ప్రజా పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ) ఎన్నిక గురువారం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. అనివార్య కారణాల వల్ల ఇటీవల కోన లోవలక్ష్మి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక జరుగుతోంది. ఎంపీపీ పదవి బీసీ మహిళకు రిజర్వు కావడంతో పోటీలో ఉత్కంఠం నెలకొంది. మండలంలో 20 ఎంపీటీసీలకు 16 ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీ వారే ఉండడంతో అధికార కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు ఏమాత్రం ఫలించవు. అయితే వైఎస్సార్ సీపీలో ముగ్గురు బీసీ మహిళలు ఉండటంతో ఎవరిని అధ్యక్ష పీఠం వరిస్తుందో వేచి చూడాల్సిందే. వైఎస్సార్ సీపీ నుంచి కొరుప్రోలు, పెట్టుగోళ్లపల్లి, తిమ్మాపురం–2లు బీసీ మహిళలుగా ఉన్నారు. ఇప్పటికే ఇద్దరు బీసీ మహిళలు వ్యక్తిగత కారణాతో రాజీనామా చేసిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో ఈ ఎన్నిక జరగనుంది.